క్లుప్తంగా

నేడు పట్టణ వైఎస్సార్ సీపీ సమావేశం

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం రూరల్ మండలంలోని ఇందుపల్లి ఎ కన్వెన్షన్ సెంటరులో మంగళవారం ఉదయం 9 గంటలకు జరుగుతుందని పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అధ్యక్షత వహిస్తారన్నారు. ఈ సమావేశానికి పట్టణంలోని పార్టీ నాయకులు, వార్డు కౌన్సిలర్లు, ఇన్‌ఛార్జిలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు విధిగా హాజరుకావాలని కోరారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



గ్రామ రెవెన్యూ అధికారుల సంఘు క్యాలెండర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

అమలాపురం రూరల్: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ క్యాలెండర్‌ను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆవిష్కరించారు. కలెక్టర్ ఛాంబర్‌లో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్, సంఘ జిల్లా అధ్యక్షుడు సాధనాల యల్లేశ్వరరావు, ప్రతినిధులు మద్దాల బాపూజీ, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, వీరబాబు పాల్గొన్నారు.

వాకర్స్ హెల్త్ క్లబ్ నూతన కార్యవర్గం



బోణం సత్య వరప్రసాద్

అమలాపురం టౌన్: అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్‌కు నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. క్లబ్ నూతన అధ్యక్షుడిగా బోణం సత్య వరప్రసాద్, కార్యదర్శిగా వలవల వీఆర్ నాయుడు, కోశాధికారిగా పి.చినరామస్వామి, ఉపాధ్యక్షులుగా రంకిరెడ్డి కాశి, పిచ్చిక రవీంద్ర, గోటేటి గంగాధరరావు, నూకల సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా కుడుపూడి త్రినాథరావు, అన్యం రాంబాబు, చింతలపూడి సత్తిబాబు, జాలీ వాకర్‌గా శ్రీఖాగోళపు రామకృష్ణ, బులెటిన్ కో–ఎడిటర్‌గా పుత్సా కృష్ణకామేశ్వర్, చైర్మన్ గ్రీటింగ్స్ ప్రతినిధిగా పీవీఆర్ నాయుడు, ముఖ్య సలహాదారుగా డాక్టర్ బి.రాఘవేంద్రరావు ఎంపికయ్యారు. నూతన కార్యవర్గం స్థానిక దుడ్డువారి అగ్రహారంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో మంగళవారం సాయంత్రం 4.30కు ప్రమాణ స్వీకారం చేయనుంది.

కమ్యూనిటీ హాలుకు మంత్రి విశ్వరూప్ నామకరణం

అమలాపురం టౌన్: నూతనంగా స్థానిక 27వ వార్డులో నిర్మించిన కమ్యూనిటీ హాలుకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ కమ్యూనిటీ హాలుగా నామకరణం చేశారు. ఆ వార్డు కౌన్సిలర్ బండారు గోవిందు.. కమ్యూనిటీ హాలుకు విశ్వరూప్ పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని మున్సిపల్ కౌన్సిల్‌లో ఉంచడంతో, కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. ఈ నెల 27న జరిగిన కౌన్సిల్ సమావేశంలో అజెండాలోని 33వ అంశాన్ని కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించడంతో, కౌన్సిలర్లంతా హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయులపై పని భారాన్ని తగ్గించాలి

– ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

అల్లవరం: విద్యా బోధనకు మాత్రమే ఉపాధ్యాయులను వినియోగించుకుని, వారిపై పనిభారాన్ని తగ్గించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ సాయి శ్రీనివాస్ అన్నారు. అల్లవరం మండలం గుడ్డివానిచింత సత్యకస్తూరి ఫంక్షన్ హాల్లో ఆదివారం రాత్రి సంఘ జిల్లా కౌన్సిల్ నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు నేరేడుమిల్లి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ మొబైల్ యాప్‌లో ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. విద్యార్థి నిష్పత్తి ఆధారంగా డీఎస్సీ ప్రకటించి, ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని, 12వ పీఆర్‌సీ ప్రకారం ఐఆర్ తక్షణమే ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి నాగేంద్రమణి, ఎంపీపీ ఇళ్ల శేష గిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, ఎంపీటీసీ గుబ్బల రంగనాథస్వామి, మాజీ జెడ్పీటీసీ గుబ్బల మాతాకస్తూరి, ప్రధాన కార్యదర్శి వి.సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు అంబటి కన్నుమూత



సత్యనారాయణ (ఫైల్)

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు అంబటి సత్యనారాయణ (84) ఆదివారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. ఆయనకు భార్య ఆదిలక్ష్మీదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సత్యనారాయణ గొల్లవిల్లితో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా 30 ఏళ్ల పాటు పనిచేశారు. ఈయన మృతికి గ్రామస్తులు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

బిజీబిజీగా అన్నదాత



గాడిలంకలో ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్న దృశ్యం

- ఊపందుకున్న దాళ్వా వరినాట్లు
- పెరిగిన కూలీల రేట్లు
- యాంత్రీకరణ, వెదజల్లుపై రైతుల మొగ్గు

ముమ్మిడివరం: వారం రోజులుగా నియోజకవర్గంలో దాళ్వా నాట్లు ఊపందుకున్నాయి. మార్చి నెలాఖరుకు కాలువలు మూసివేస్తామన్న అధికారుల హెచ్చరిక నేపథ్యంలో నాట్లు వేసే ప్రక్రియ వేగం పుంజుకుంది. నియోజకవర్గంలో సుమారు 46 వేల ఎకరాల్లో దాళ్వాసాగు చేస్తుండగా, 90 శాతానికి పైగా నాట్లు పూర్తయ్యాయి. మరో రెండు రోజుల్లో చాలావరకు నాట్లు పూర్తి చేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. త్వరితగతిన పంట చేతికొచ్చే ప్రక్రియలో వెదజల్లు, కూలీల కొరతను అధిగమించేందుకు యంత్రాలతో నాట్లు వేయడం వంటి ప్రత్యామ్నాయాలపై రైతులు దృష్టి సారిస్తున్నారు.

వెదజల్లుపై మక్కువ

సాగునీటి ఎద్దడి, కూలీల సమస్యను అధిగమించేందుకు రైతులు వెదజల్లు సాగు చేపడుతున్నారు. మార్చి నెలాఖరుకల్లా సాగు పూర్తి చేయాలని అధికారుల సూచనల మేరకు రైతులు నాట్లు వేసే ప్రక్రియను త్వరితగతిని ముగించేందుకు సిద్ధమయ్యారు.

నాట్లకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

నాట్లు వేసేందుకు నారు తీసే సమయంలో ఆకుపచ్చగా ఉండాలని, దీనివల్ల నారు త్వరగా మొన తిరిగే అవకాశం ఉంటుందని వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంతకుమార్ తెలిపారు. నాలుగు నుంచి ఆరు ఆకులు తొడిగే నారుని ఉపయోగించాలన్నారు. ముదురు ఆకును నాటితే దిగుబడి తగ్గుతుందన్నారు. నాట్లు పైపైన నాటితే పిలకలు ఎక్కువ తొడిగే అవకాశం ఉందన్నారు. నాట్లు వేసే ముందు నారు సుతలను తుంచాలన్నారు. నారు చివర వివిధ కీటకాలు గుడ్లు పెడతాయని, నారు తుంచడం వల్ల దానిపై ఉన్న క్రిమికీటకాల గుడ్లను నిర్మూలించవచ్చన్నారు. దీంతో నాట్ల దశలో వివిధ తెగుళ్లను తట్టుకునే శక్తి పెరుగుతుందన్నారు. నాట్లు వేసే ముందు దమ్ములో ఎకరాకు 20 కేజీల జింకు వేస్తే, దాని లోపాన్ని నివారించవచ్చన్నారు. ఎకరాకు 50 కేజీల సూపర్ ఫాస్ఫేట్ వేయాలన్నారు. చదరపు మీటరుకు 44 మూనలు నాటాలని వివరించారు.

కలెక్టర్‌కు సెర్ప్ ఉద్యోగుల వినతి



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సెర్ప్ ఉద్యోగులు

అమలాపురం రూరల్: వారం రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదురుగా సోమవారం వంటా–వార్పు కార్యక్రమం నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతి పత్రం అందించారు. సెర్ప్ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు డి.వరాలబాబు, కార్యదర్శి ముత్తాబత్తుల. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సెర్ప్ ఉద్యోగులు కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. 31వ తేదీన జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో తమ సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాట్రేనికోన మండల వీఓఏలు, వివిధ మండలాల ఎంఎస్ అకౌంటెంట్లు సెర్ప్ ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు.

పెన్షనర్ల ధర్నా

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ పెన్షనర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు పి.కృష్ణశాస్త్రి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. డీఏ బకాయిలను చెల్లించాలని, పెన్షనర్లకు ప్రతినెలా ఒకటో తేదీన పెన్షన్లు చెల్లించాలని, హెల్త్‌కార్డులు అన్ని ఆస్పత్రుల్లో అనుమతించేలా చూడాలని తదితర డిమాండ్లను ముందుంచారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతిపత్రం అందజేశారు.

అవార్డు గ్రహీతలకు సత్కారం



సర్పంచ్ ఏసుబాబు సత్కరిస్తున్న దృశ్యం

అమలాపురం రూరల్: ఉత్తమ పురస్కారాన్ని అందుకున్న తాండవపల్లి సర్పంచ్ గంగుమళ్ల ఏసుబాబు సేవలు ప్రశంసనీయమని గ్రామ ప్రజలు, పలువురు ప్రజాప్రతినిధులు కొనియాడారు. సర్పంచ్ ఏసుబాబును గ్రామ సచివాలయంలో సోమవారం రాత్రి శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఎంపీటీసీ రేవు శ్రీనుబాబు, కార్యదర్శి బి.ఆదిశంకరం, వీఆర్‌ఓ వినోద్‌కుమార్, ఉప సర్పంచ్ గుత్తాల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పరమట శ్రీనివాసరావు, మాజీ సర్పంచులు ములపర్తి సత్యనారాయణ, పరమట శరత్‌బాబు, పంచాయతీ ఉద్యోగుల సంఘ నాయకుడు రాము తదితరులు సన్మానం చేశారు. అదేవిధంగా ఉత్తమ పురస్కారాన్ని అందుకున్న వన్నె చింతలపూడి పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ సత్తిబాబును గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ నక్కా రాజారత్న నాగవాణి, కార్యదర్శి పి.ధనలక్ష్మి ఈ సత్కారం చేశారు.

శెట్టిబలిజ పితామహుడు వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ



హైస్కూలు సెంటర్‌లో ఆవిష్కరించిన దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహం

అమలాపురం టౌన్: అమలాపురం హైస్కూలు సెంటరులో శెట్టిబలిజ సామాజికవర్గ పితామహుడు, దివంగత దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం రాత్రికిరాత్రి జరగడం పట్టణంలో సోమవారం చర్చనీయాంశమైంది. ఎలాంటి ఆర్భాటం లేకుండా పట్టణంలోని శెట్టిబలిజ ముఖ్యనేతలకూ తెలియకుండా ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ విగ్రహాన్ని ఎవరు ఆవిష్కరించారో తెలియని పరిస్థితి ఏర్పడింది. హైస్కూలు సెంటరు కూడలి రోడ్డు మధ్యలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నిలువెత్తు విగ్రహం వెనుక డివైడర్‌ను కొంత భాగం తొలగించి, అక్కడ వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సెంటరులో వెంకటరెడ్డి విగ్రహం ఏర్పాటుకు గత కౌన్సిల్ సమావేశం ఆమోద ముద్ర వేసింది. ఇదే విషయాన్ని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ బాలసుబ్రహ్మణ్యం కూడా విగ్రహం ఏర్పాటు చేసినట్టు తన దృష్టికి రాలేదని చెప్పారు.

బాధిత కుటుంబానికి సాయం

అమలాపురం రూరల్: గున్నేపల్లి అగ్రహారంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బొలిశెట్టి శివ కుటుంబానికి అమలాపురం మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. మరో పార్టీ నాయకుడు పితాని బాలకృష్ణ బాధితుడికి దుస్తులు, నగదు సాయం అందజేశారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

కె.గంగవరం: మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్‌చంద్రబోస్ హాజరయ్యారు. ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ శాఖల వారీగా ప్రగతి నివేదికను సభ్యులకు వివరించాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, వెలుగు, ఎంజీఎన్ఆర్‌జీఎస్, వైద్య, విద్య తదితర ప్రభుత్వ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు నివేదిక చదివి సభలో వినిపించారు. అయితే ఆయా శాఖలకు చెందిన సభ్యులు సమస్యలపై అధికారులను నిలదీశారు. ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ విషయంలో ప్రజాప్రతినిధులకు కూడా సమాచారం లేకుండా చేస్తున్నారని ఇకపై పంపిణీలో ఎంపీటీసీలను, సర్పంచ్‌లను భాగస్వామ్యులను చేయాలన్నారు. జగనన్న ఇళ్లకాలనీల వద్ద రోడ్లు నిర్మించాలని కోరారు. సుందరపల్లి ఎంపీటీసీ రాజు మాట్లాడుతూ గ్రామంలో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయాలని కోరారు.

దిశ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి



కె.గంగవరం ఉన్నత పాఠశాలలో దిశ చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజ్యలక్ష్మి

కె.గంగవరం: ప్రభుత్వ చేసిన దిశ చట్టంపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని దిశ పోలీస్ స్టేషన్ ఎస్సై డి.రాజ్యలక్ష్మి సూచించారు. మండల కేంద్రమైన కె.గంగవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దిశ చట్టం, బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. విద్యార్థినులు మారుతున్న కాలానికి అనుగుణంగా జాగ్రత్తగా ఉండాలని, విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు నేర్చుకోవడంతో పాటు చదువు, క్రీడల్లో ముందుండాలని సూచించారు. బాలికలకు భద్రత విషయంలో సహాయం అవసరమైతే నిర్భయంగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం యండగండిలోని హెరిటేజ్ పాల ఫ్యాక్టరీ కార్మికులకు కూడా దిశ చట్టంపై అవగాహన కల్పించారు. దిశ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ రషీద, హెచ్‌ఎం పాడగట్లపల్లి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పీవీ బ్రహ్మానందం, ఏడుకొండలు, శ్రీనివాస్, రాఘవకుమారి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎన్‌వైకే సలహా కమిటీ సభ్యుడిగా ఉదయ్‌కుమార్



ఉదయ్‌కుమార్

అల్లవరం: నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సభ్యునిగా అల్లవరం మండలం తూర్పులంక గ్రామానికి చెందిన నవ భారత్ నిర్మాణ సంస్థ అధ్యక్షుడు కడలి ఉదయ్ కుమార్‌ను ఎంపిక చేస్తూ కేంద్ర క్రీడా శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ నుంచి ఉత్తర్వులు సోమవారం అందాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సామాజిక, వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాల్లో స్వతంత్రంగా సేవ చేస్తున్న ఉదయ్‌కి కేంద్ర క్రీడా శాఖ గుర్తింపునిచ్చింది. కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, ఎన్‌వైకే మాజీ జిల్లా యువ అధికారి అమృతేష్‌కి ఉదయ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

సమగ్ర శిక్షా ఏపీసీగా మధుసూదన రావు



ముమ్మిడివరం: సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా ఎ.మధుసూదనరావు సోమవారం పూర్తి స్థాయి బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ కలెక్టర్ పదోన్నతి పొందిన ఆయనను రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సమగ్ర శిక్షా ప్రాజెక్టుకు ఏపీసీగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి ఇప్పటి వరకు సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన సమగ్ర శిక్షా కార్యాలయ సిబ్బంది, సెక్టోరల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

9లోపు రిజిస్ట్రేషన్లు పూర్తి

అమలాపురం రూరల్: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు అందించిన నివేశన స్థలాలను రిజిస్ట్రేషన్ కోసం సిద్ధం చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం భూపరిపాలన ముఖ్య కమిషనర్ జి.సాయిప్రసాద్ అమరావతి నుంచి 26 జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంపై దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, స్థలాల మ్యాపింగ్ పూర్తి చేయాలని, ఇళ్ల స్థలాల లబ్ధిదారుల పేర్లు ఎదురుగా ప్లాట్ నంబరు, సర్వే నంబర్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఫిబ్రవరి 9 లోపు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, భూ సేకరణ సెక్షన్ సూపరింటెండెంట్ పి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

జిల్లా కుష్ఠు ఎయిడ్స్, క్షయ వ్యాధి నివారణ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఫిబ్రవరి 13 వరకు స్పర్శ కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఎం.దుర్గారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకార పరిహారం కోసం 31న ధర్నా

యానాం: నియోజకవర్గ ప్రజలకు ఓఎన్‌జీసీ సంస్థ మంజూరు చేసిన పరిహారాన్ని పంపిణీ చేయాలంటూ ఈ నెల 31న ధర్నా నిర్వహిస్తున్నట్టు, ఈ మేరకు తాము సంబంధిత అనుమతులు తీసుకున్నామని సోమవారం మత్స్యకార యువ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. మత్స్యకార కుటుంబాలకు గత 24 నెలలుగా రావాల్సిన పరిహారం సొమ్ము పంపిణీ ఆలస్యానికి, ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా జరిగే ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో మత్స్యకారులు, ప్రజాసంఘాలు, స్థానిక ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు.

చీఫ్ సెక్రటరీగా చౌహాన్ నియామకం

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఏజీఎంయూటీ కేడర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ శరత్ చౌహాన్‌ను నియమిస్తూ సోమవారం కేంద్ర హోం శాఖ డైరెక్టర్ బీజీ కృష్ణన్ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు ప్రధాన కార్యదర్శిగా ఉన్న రాజీవ్ వర్మను ఛండీగఢ్ అడ్మినిస్ట్రేటర్‌గా బదిలీ చేశారు. నియామక ఉత్తర్వులు తక్షణం అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

కౌన్సిల్ సంప్రదాయాన్ని పాటించండి



సమావేశంలో సభ్యుల మధ్య వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

- సభ్యుల తీరుపై చైర్మన్ ప్రవీణ్ ఆగ్రహం
- పోడియం వద్ద ప్రతిపక్షాల బైఠాయింపు
- అంశాలన్నీ ఏకగ్రీవంగా ఆమోదించి.. సమావేశం ముగింపు

ముమ్మిడివరం: ప్రజా సమస్యలపై చర్చించకుండా సభా సమయాన్ని వృథా చేస్తూ, ప్రతిపక్ష సభ్యులు లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నగర పంచాయతీ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. అజెండాలోని 17 అంశాలపై సభ్యులు చర్చిస్తుండగా, 11 అంశంలో రూ.15 లక్షలతో గేదిల్లంక ఆయిల్ ఇండియా సైట్ నుంచి గ్రావెల్ తెచ్చి 20 వార్డుల్లో ఉన్న రోడ్ల ప్యాచ్ వర్క్ చేస్తున్న అంశంపై టీడీపీ ఫ్లోర్‌లీడర్ ములపర్తి బాలకృష్ణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎటువంటి టెండర్లు లేకుండా నాణ్యత లేని గ్రావెల్‌తో రోడ్లు ప్యాచ్ వర్క్ చేయడం ఎంతవరకు సమంజసమని ఏఈ సత్యనారాయణను ప్రశ్నించారు. దీనిపై చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ స్పందిస్తూ, గత సమావేశాల్లో కనీసం వార్డుల్లో అధ్వానంగా ఉన్న రహదారులకు రెండు లారీల చొప్పున గ్రావెల్ వేసి గోతులు పూడ్చాలని సభ్యులు కోరారని, ఆ మేరకు సాధారణ నిధుల నుంచి రహదారుల ప్యాచ్ వర్క్ చేస్తున్నామని వివరించారు. దీనిపై సంతృప్తి చెందని టీడీపీ సభ్యులు పోడియం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీనిపై ఫ్లోర్‌లీడర్ బాలకృష్ణ, చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. 17వ వార్డు కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్ జోక్యం చేసుకుని, ఇదే అంశం పలు సమావేశాల్లో చర్చకు వచ్చిందని, అయితే టెండర్లతో పనిలేదని, గ్రావెల్ నాణ్యతలో మాత్రం సంబంధిత అధికారుల లోపం ఉందన్నారు. ప్రతిపక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేస్తున్నప్పటికీ, అధికార సభ్యులు అజెండాలోని 17 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించి సమావేశం ముగించారు. ఈ సమావేశంలో కమిషనర్ జి.లోవరాజు, వైస్ చైర్మన్లు రెడ్డి హేమసుందరి, వేటుకూరి బోసురాజు, కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

దక్షిణ భారత సైన్స్ ఫెయిర్‌కు యానాం ప్రాజెక్టు



ఎంపికైన ప్రాజెక్టుతో యానాం విద్యార్థులు

యానాం: విజయవాడలో జరిగే దక్షిణ భారత జాతీయ సైన్స్ ఫెయిర్–2024కు యానాం నియోజకవర్గం నుంచి శారదా ప్రభుత్వ ఎయిడెడ్ హైస్కూల్ విద్యార్థులు రంగాల అభినవ్‌కుమార్, పోతుల లోకేశ్వర్ రూపొందించిన ప్రాజెక్టు ఎంపికైంది. వీరు తయారుచేసిన ఆటోమేటిక్ ఫ్లషింగ్ టాయిలెట్ ఎంపికైందని హెచ్‌ఎం చిక్కాల వెంకటేశ్వరరావు, గైడ్ టీచర్ షేక్ అహ్మద్ అలీషా సోమవారం తెలిపారు. సింపుల్ మెకానిజంతో తయారుచేసిన ప్రాజెక్టు వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, గైడ్ టీచర్‌ను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

పరీక్షా పే చర్చాలో నవోదయ విద్యార్థులు



పరీక్షా పే చర్చాలో యానాం నవోదయ విద్యార్థులు తయారుచేసిన బొమ్మలు, చిత్రాల ప్రదర్శన

యానాం: విద్యార్థుల్లో పరీక్షలపై భయాన్ని, ఒత్తిడిని తొలగించి, వారిని నిర్భయంగా పరీక్షలు రాసేలా తీర్చిదిద్దేందుకు ప్రధాని మోదీ ద్వారా నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చా–2024లో సోమవారం యానాం నవోదయ విద్యార్థులు పాల్గొన్నారు. వారు తయారు చేసి, ప్రదర్శించిన కల్చర్ అండ్ హెరిటేజ్ 2డీ, 3డీ చిత్రాలను, ఏటికొప్పాక లక్కబొమ్మల తయారీని ప్రధాని స్వయంగా తిలకించి, అభినందించడం ఆనందాన్నిచ్చిందని ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఢిల్లీలోని భారత మండపంలో జరిగిన కార్యక్రమంలో విద్యాలయ ఆర్ట్ టీచర్ వెంకటేశ్వర్లు, విద్యార్థులు దుర్గేష్, సతీష్‌కుమార్ పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులకు ప్రధాని అందించిన సూచనలు, మార్గదర్శకాలు కార్యక్రమాన్ని విద్యార్థులందరికీ ప్రత్యక్ష ప్రసారం చేసినట్టు పేర్కొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఐ.పోలవరం: కేశనకుర్రుపాలెం జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం పి.శ్రీనివాసకుమార్ ఆధ్వర్యంలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు సోమవారం బైజూస్ ట్యాబ్‌లు, పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నం రాజు వెంకటపతిరాజు మాట్లాడుతూ ట్యాబ్‌ల వల్ల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం పెరుగుతుందన్నారు. జిల్లా స్థాయి కౌశల్ పోటీల్లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులకు నగదు, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ మాధవీలత, సొసైటీ అధ్యక్షులు ఇందుకూరి రంగరాజు, ఆదినారాయణ, మోకా రవి, మాజీ జెడ్పీటీసీ కాశి పరివాజ్ కుమార్ తదితరులు ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

కాలువలో చిన్నారి గల్లంతు



పల్లంకుర్రు పంట కాలువలో గాలిస్తున్న స్థానికులు

కాట్రేనికోన: స్నానానికి దిగిన ఏడేళ్ల పాప కుంచెనపల్లి సమీపంలో బొబ్బర్లంక–పల్లంకుర్రు ప్రధాన పంట కాలువలో గల్లంతైంది. సంచార జాతులకు చెందిన ఓ కుటుంబం కుంచెనపల్లి వద్ద ఏటిగట్టుపై గుడారం వేసుకుని నివసిస్తోంది. స్నానం చేసేందుకు సోమవారం పంట కాలువలోకి దిగిన పాప.. నీటి ప్రవాహంలో కొట్టుకుపోవడాన్ని ఆమె కుటుంబ సభ్యులు గుర్తించారు. స్థానికుల సహకారంతో వారు గాలింపు చర్యలు చేపట్టారు. రెండు గంటల పాటు కాలువలో గాలించినా ఫలితం లేకపోయింది. ఆమె తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

అల్లవరం: మండలంలోని బోడసకుర్రు టిడ్కో భవనం బి–బ్లాక్ ఎస్ఎఫ్–2లో గంధం ప్రసాద్ (22) సోమవారం ఉదయం ఫ్యాన్ రింగ్‌కు ఉరి వేసుకుని, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బి–బ్లాక్‌లోని ఎస్ఎఫ్–8లో గంధం కుమారి తన ఇద్దరు కుమారులతో నివాసం ఉంటోంది. ప్రసాద్ మద్యానికి బానిసై రాత్రి వేళల్లో ఆలస్యంగా ఇంటికి వస్తుండడంతో, రెండురోజుల క్రితం ప్రసాద్‌ని తల్లి కుమారి మందలించింది. సోమవారం ఉదయం తల్లి, సోదరుడు ఫ్లాట్ నుంచి అమలాపురం వెళ్లిన తర్వాత వీరి ఫ్లాట్‌కి ఎదురుగా ఖాళీగా ఉన్న ఎస్ఎఫ్–2లో ఫ్యాన్ రింగ్‌కు ఉరి వేసుకుని ప్రసాద్ ఆత్మహత్య చేసుకున్నాడు. తమతో పాటుగా అమలాపురం రావాల్సిన ప్రసాద్ రాకపోవడంతో వారు నివాసం ఉంటున్న బ్లాక్ వద్దకు వచ్చి చూశారు. మోటారు సైకిల్ అక్కడే ఉన్నా ప్రసాద్ కనిపించకపోవడంతో మొబైల్‌కి కాల్ చేశారు. దీంతో వీరికి ఎదురుగా ఉన్న ఫ్లాట్ నుంచి మొబైల్ రింగ్ రావడంతో తలుపులు పగలగొట్టి చూడగా అప్పటికే ప్రసాద్ మృతి చెందాడు.. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అల్లవరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పంపించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై హరీష్‌కుమార్ తెలిపారు.

ఇద్దరికి గాయాలు

ముమ్మిడివరం: స్కూటీపై వస్తున్న ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. ఉప్పలగుప్తం మండలం మునిపల్లికి చెందిన దోనిపాటి సతీష్, ముమ్మిడివరానికి చెందిన కుంచే రాజేష్ సోమవారం భీమనపల్లి నుంచి స్కూటీపై ముమ్మిడివరం వైపు వస్తుండగా, అనాతవరం సమీపంలో ప్రమాదానికి గురయ్యారు. రాజేష్‌కు తీవ్ర గాయాలు కాగా, సతీష్ గాయపడ్డాడు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. స్థానికుల సమాచారంతో క్షతగాత్రులను 108లో అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురిపై పిచ్చి కుక్క దాడి

కాట్రేనికోన: మండల కేంద్రం కాట్రేనికోన పంచాయతీలో పిచ్చి కుక్క విచక్షణా రహితంగా దాడి చేయడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పిచ్చి కుక్కను యువకులు కర్రలతో మూకుమ్మడిగా తరిమి వేయడంతో కొత్తపాలెం వైపు పారిపోయిందన్నారు. కుక్క కాటుకు గాయపడిన వారిని కాట్రేనికోన సీహెచ్‌సీకి తరలించగా, యాంటిరాబిస్ వ్యాక్సిన్ అందుబాటులో లేకపోవడంతో అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పిచ్చి కుక్క ఒక వ్యక్తిపై దాడి చేసి, చేతి వేలును కొరుక్కుపోయింది. గాయపడిన వారు ప్రస్తుతం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.